సాక్షి
కుమురం భీం
శనివారం : 31 : ఆగస్టు : 2024



ఆర్టీసీలో సెమీ డీలక్స్
ఆర్టీసీ కొత్తగా సెమీ డీలక్స్ సర్వీసులు అందుబాటులోకి తెచ్చింది. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ప్రయాణికుల నుంచి స్పందన లభిస్తోంది. 8లో▸



బాబా జీవితం ఆదర్శప్రాయం
పూలాజీబాబా శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు బాబా సమాధి వద్ద పూజలు చేశారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
30.3 /24.4

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అల్పపీడనం ప్రభావంతో జిల్లా అంతటా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

10 నుంచి సదరం శిబిరాలు

ఆసిఫాబాద్‌అర్బన్: దివ్యాంగుల కోసం సెప్టెంబర్ 10 నుంచి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీవో దత్తారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 10న మూగ, చెవిటి, మానసిక వైకల్యం ఉన్న వారికి, 17న కంటి సమస్యలు, 21, 24 తేదీల్లో ఎముకల సంబంధిత సమస్యలు ఉన్నవారిని వైద్యులు పరీక్షిస్తారని పేర్కొన్నారు. శిబిరాలకు హాజరయ్యే వారు సంబంధిత పీహెచ్‌సీల్లో వికలత్వ పరీక్ష చేయించుకుని స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి వైద్యశిబిరాలు నిర్వహించాలని డీవైఎఫ్ఐ, కేవీపీఎస్, టీఏజీఎస్, సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో శుక్రవారం డీఎంహెచ్‌వో తుకారాం భట్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో వైద్యులను నియమించి, రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజుల పట్టికలు లేవన్నారు. పేదలు తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్తే దోచుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, జిల్లా అధ్యక్షుడు టీకానంద్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలశ్రీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, నాయకులు శ్రీనివాస్, నిఖిల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో గణేశ్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండపాల నిర్వాహకులు పోలీసుశాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. https://policeportal.tspolice.gov.in వెబ్‌సైట్‌లో గణేశ్ ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, నిమజ్జనం తేదీ, ప్రదేశం తదితర వివరాలు నమోదు చేసి రిజిస్టర్ చేసుకోవాలన్నారు. డీజేల ఏర్పాటుకు అనుమతి లేదని, మండపాల వద్ద 24 గంటల పాటు ఒక వలంటీర్ ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనుమానాస్పద బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు, వ్యక్తులు కనిపిస్తే తక్షణమే డయల్ 100, పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు వ్యాపింపజేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



లోనవెల్లిలో భోజనం వడ్డిస్తున్న డీఈవో

సిర్పూర్(టి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని డీఈవో అశోక్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలతోపాటు లోనవెల్లి జెడ్పీ పాఠశాలను శుక్రవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. లోనవెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గైర్హాజరు కావడంతోపాటు రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఎఫ్‌పీ ప్యానెల్ నిరుపయోగంగా వదిలేయడం సరికాదన్నారు. రేపటిలోగా టీవీలను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే నాణ్యమైన విద్యనందించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా సైన్స్ అధికారి కె.మధుకర్, పీజీ హెచ్‌ఎంలు ప్రమీల, సదాశివుడు, సీఆర్పీలు పవన్‌కుమార్, రాజేశ్, సిబ్బంది ఉన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని డీఈవో అశోక్ అన్నారు. బోడపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులు చదువులో వెనుకబడకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులేదనని స్పష్టం చేశారు. అనంతరం పట్టణంలోని జెడ్పీ బాలుర పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు.

తనిఖీలు నిల్.. మోసాలు ఫుల్

- అరకొర దాడులతో చేతులు దులుపుకొంటున్న అధికారులు
- ఈ ఏడాది జూలై వరకు కేవలం 26 షాపులపైనే కేసులు
- అక్రమాల నియంత్రణకు చర్యలు కరువు
- అడుగడుగునా నష్టపోతున్న వినియోగదారులు



సాక్షి, ఆసిఫాబాద్: గుండుసూది నుంచి గునపం వరకూ.. పప్పు నుంచి ఉప్పు వరకూ.. ఏది కొనుగోలు చేయాలన్నా తూనికలు కొలతలే ప్రామాణికం. ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలిచ్చి అడుగుడునా దగా చేసి వినియోగదారుడిని ఏమార్చి దోచుకోవడానికి సిద్ధంగా ఉంటారు కొందరు స్వార్థపరులు. ఈ మోసాలను నియంత్రించాల్సిన వ్యవస్థ తూతూమంత్రంగా తమ ఉనికిని చాటుకుంటోంది. మార్కెట్‌లో వివిధ రకాలుగా వినియోగదారులు మోసపోతున్నా పట్టించుకోవడం లేదు. అరకొర దాడులతో తూనికల కొలతల శాఖ చేతులు దులుపుకుంటోంది.

ఇన్‌చార్జి అధికారికి బాధ్యతలు..

జిల్లాస్థాయి అధికారి లేకపోవడంతో ఇన్‌చార్జి అధికారి పర్యవేక్షణలో సిబ్బంది ఏటా నిర్వహించే తూనికల రాళ్ల స్టాంపింగ్, రెన్యువల్ ద్వారా వచ్చే రెవెన్యూ వసూలు చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన జిల్లా ఇన్‌స్పెక్టర్ ఇక్కడా ఇన్‌చార్జి హోదాలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ నియోజకవర్గాల పరిధిలో క్షేత్రస్థాయిలో వ్యాపార సంస్థలను తనిఖీ చేసేందుకు ఇద్దరేసి ఇన్‌స్పెక్టర్‌లు, వారికి సహాయకులు ఉండాలి. అయితే జిల్లా మొత్తం ఒక్క ఇన్‌స్పెక్టర్‌తో దాడులు నిర్వహించాల్సి వస్తోంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని 15 మండలాల్లో పలు రకాల దుకాణాలు సుమారు 4300కు పైగా ఉన్నాయి. కాగజ్‌నగర్ పట్టణ కేంద్రంగా పనిచేస్తున్న తూనికలు కొలతల శాఖ అధికారులు 35 రకాల దుకాణాల్లో తనిఖీలు చేసి అక్రమాలను అరికట్టాల్సి ఉంది. మోసాలకు పాల్పడుతున్న వారిపై కేసులు పెట్టి జరిమానా విధించి వినియోగదారులకు భరోసా కల్పించాల్సి ఉంది. అయితే ఇక్కడ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఈ ఏడాది జూలై వరకు కేవలం 26 షాపులపై తూనికల కొలతల శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. వీరి నుంచి రూ.2.09 లక్షల జరిమానా వసూలు చేశారు.

స్టాంపింగ్‌తోనే సరి..

ఉన్న ఒక్క ఇన్‌స్పెక్టర్ వార్షికంగా నిర్వహించాల్సిన కాంటా రాళ్ల తనిఖీలు, వాటి స్టాంపింగ్, రెన్యూవల్ తదితర విధులు నిర్వహిస్తూ రెవెన్యూ వసూలు చేయాలి. దీంతోపాటు తనిఖీలు నిర్వహించి అవకతవకలను నియంత్రిస్తూ కేసులు నమోదు చేయాలి. అయితే వ్యాపార కేంద్రాలైన ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో స్టాంపింగ్ ప్రక్రియకే ఎక్కువ సమయాన్ని అధికారులు వెచ్చించాల్సి వస్తోంది. అదే సమయంలో ఎలక్ట్రానిక్ వేయింగ్ పరికరాలను సైతం సర్టిఫై చేయాల్సి ఉంటుంది. దీంతో దోపిడీ పెరిగి వినియోగదారులు నష్టపోతున్నారు. కొనుగోలుకు వెళ్లిన వినియోగదారుడు మార్కెట్‌లో వివిధ రకాలుగా మోసపోతున్నాడు. తప్పుడు తూకంతో పాటు, ఆఫర్ల ముసుగులో కాలం చెల్లిన వస్తువులను కొనుగోలు చేయడం.. ప్యాకింగ్ మీద ముద్రణకు లోపల సరుకుకు సంబంధం లేకుండా ఉండటంతో తమ జేబులను గుల్ల చేసుకుంటున్నారు.

బంగారం తూకంలో జాగ్రత్త..

బంగారం కొనుగోలు చేసే సమయంలో తూకం జాగ్రత్తగా చూసుకోవాలి. 1 ఎంజీ యంత్రంపై తూచేలా చూసుకోవాలి. దీనివల్ల కచ్చితమైన తూకం వస్తుంది. దుకాణదారుడి వద్ద ఉండే తూనికల కొలతల శాఖ ఆమోదించిన బులియన్ టెస్ట్ వెయిట్స్‌ని కాంటాపై పెట్టి తూకం చూపుతోందో లేదో వినియోగదారుడు గమనించి కొనుగోలు చేయాలి.

గృహనిర్మాణ సామగ్రి కొనుగోలులో..

స్టీలు కొనుగోలు చేసే సమయంలో కొన్ని వ్యాపార దుకాణాల్లో టన్నుకు 20 నుంచి 30 కిలోలు తగ్గేలా కాంటాలో మార్పులు చేసుకుంటున్నారు. అలాగే 50 కిలోలుగా భావించే సిమెంట్ బస్తాలో 45 కేజీలే ఉండటం గమనార్హం. ఎక్కువ సరుకు కొనుగోలు చేసే సమయంలో ఆ సరుకును మరో యంత్రంపై తూకం వేయించుకోవడం శ్రేయస్కరం. లేదంటే అదే దుకాణంలో ఉండే తూనికల రాళ్లను తూకం వేసి కాంటా పనితీరు నిర్ధారించుకోవాలి.

పెట్రోలు బంకుల వద్ద..

హడావుడిగా బంకుల వద్ద పెట్రోలు పోయించుకునే వారు వాహనాల్లో నింపే ముందు మీటరు సున్నా చూపుతోందో లేదో గమనించాలి. ఒకరికి పెట్రోలు కొట్టిన తరువాత పంప్ నాజిల్‌కు పెట్టకుండా వేరొకరికి కొట్టడం, వేగంగా కొట్టడం ద్వారా మోసానికి పాల్పడే అవకాశం ఉంది. మీటరులో లీటర్ల నమోదు చేసి పంపుగన్ హ్యాండిల్‌ను నొక్కి కొట్టడం మొదలు పెట్టాక గన్‌లోని పెట్రోలు అయిపోయే వరకూ హ్యాండిల్‌ను వదలకుండా చూడాలి.

తూనిక రాళ్లు.. కొలత పాత్రల విషయంలో..

సరకుల తూకం సమయంలో తూనిక రాళ్ల పైకి బాగానే ఉన్నట్లు కనిపించినా తూకంలో మోసం ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో తూనిక రాళ్ల లేతిమిషనుపై అరగదీసి బరువు తగ్గిస్తుంటారు. కాంటా సామర్థ్యానికి మించి తూచినా తూకంలో తేడా తప్పదు. కాంటా రాయి కింద అధికారులు వేసిన లెడ్ ముద్రను తొలగించడం ద్వారా రాయి బరువును తగ్గిస్తుంటారు. కొనుగోలు సమయంలో తూనిక రాయికి ఆ ఏడాది వేసిన తూనికల కొలతల శాఖ తనిఖీ ముద్ర ఉందో లేదో గమనించాలి. కొలత పాత్రలు కటింగ్ చేయడం, లోపల మందంగా తారుపూయ డం, కింద భాగంలో నొక్కినట్లుగా సొట్ట పె ట్టడం, పక్కభాగంలో సొట్టపెట్ట డం, అడు గు మట్టు తగ్గించి వెల్డింగ్ చేయించడం ద్వా రా కొలతల్లో మోసాలకు పాల్పడుతుంటా రు. వీటిని గమనించకుంటే లీటరుకు 50 నుంచి 100 గ్రాములు మోసపోవాల్సి వస్తుంది.

గ్యాస్ సిలిండరు తీసుకునే సమయంలో...

వంట గ్యాస్ సిలిండరు తీసుకునే సమయంలో స్ప్రింగ్ కాంటాతో తూకం వేయించుకోవాలి. సిలిండర్‌కు సంబంధించి సీల్ గట్టిగా ఉందో లేదో చూసుకుని తీసుకోవాలి. షాపింగ్ మాల్స్‌లో ప్యాకింగ్ ఉత్పత్తులపై ఉత్పత్తిదారుడి చిరునామా, ప్యాకింగ్ తేదీ, సరైన బరువు, ఎంఆర్‌పీ(టాక్స్‌తో కలుపుకుని), ఈమెయిల్ అడ్రస్, కస్టమర్ కేర్ నంబరు, ఫోన్ నంబరును చూపించే విధానం స్పష్టంగా కనబడేలా ఉంటేనే కొనుగోలు చేయాలి.

మోసాలు అరికట్టేందుకు చర్యలు

తూనికల కొలతల్లో మోసాలపై సమాచారం అందిస్తే దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా కొనుగోలుదారుల్లో అవగాహన ఉండాలి. అప్పుడే మోసాలు పూర్తిస్థాయిలో అదుపు చేయగలం.
– అబ్దుల్ జలీల్, ఇన్‌స్పెక్టర్, తూనికలు కొలతల శాఖ

కోలుకుంటున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



ఎమ్మెల్యే కోవ లక్ష్మిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

ఆసిఫాబాద్‌అర్బన్: తీవ్ర జ్వరంతో అస్వస్థతకు గురైన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోలుకుంటున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు వేర్వేరుగా ఎమ్మెల్యేను పరామర్శించి ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



రాస్తారోకో చేస్తున్న నాయకులు

తిర్యాణి(ఆసిఫాబాద్): పంట రుణాలు తీసుకున్న రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని శుక్రవారం మండల కేంద్రంలోని కుమురంభీం చౌరస్తా వద్ద తుడుందెబ్బ, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అంతకు ముందు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెడ్మ భగవంత్‌రావు, మాజీ జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు మడావి గుణవంత్‌రావు, సార రమేశ్‌గౌడ్, పులి వెంకటేశ్, పోలస రమేశ్, భాస్కర్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

బడి స్వచ్ఛతకు బాసట

- రేపటి నుంచి 'స్వచ్ఛ పక్వాడా'
- పక్షం రోజులు కొనసాగనున్న కార్యక్రమం
- ఉమ్మడి జిల్లాలో నాలుగు వేల పాఠశాలల్లో నిర్వహణ
- పరిశుభ్రత, ఆరోగ్యమే లక్ష్యాలుగా రోజుకో కార్యక్రమం



మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు(ఫైల్)

ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల వివరాలు

జిల్లా	పాఠశాలలు
నిర్మల్	842
ఆదిలాబాద్	1,279
మంచిర్యాల	847
కుమురంభీం	1,148
మొత్తం	4,116

నిర్మల్‌ఖిల్లా: వానాకాలం సీజన్ నేపథ్యంలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలని లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. 'స్వచ్ఛపక్వాడ' పేరిట సెప్టెంబరు 1 నుంచి పక్షం రోజులు రోజుకో కార్యక్రమం చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించాయి. ప్రతీరోజు ప్రత్యేక కార్యక్రమం చేపట్టేందుకు పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. పరిసరాలు పరిశుభ్రంగా లేనిచోట సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలుతున్నందున, పరిశుభ్రతతో వ్యాధులను దూరం చేయాలన్న లక్ష్యంతో స్వచ్ఛపక్వాడ కార్యక్రమం అమలు చేయనున్నారు. ఆరోగ్యం, పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన పెంచాలనే లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ స్వచ్ఛత పక్షోత్సవాలను 'స్వచ్ఛపక్వాడ' పేరిట నిర్వహించనుంది.

రేపటి నుంచి ప్రారంభం..

సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రతీ రోజు స్వచ్ఛ పక్వాడలో భాగంగా రోజుకో కార్యక్రమం నిర్వహించనున్నారు. విద్యార్థులకు సమాజంపై బాధ్యత, స్వచ్ఛతపై అవగాహన కల్పించడం, వారిలో దాగిఉన్న ప్రతిభను గుర్తించేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల విద్యాశాఖ అధికారులకు సమాచారమందించి సన్నద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో దాదాపు 4 వేలకుపైగా ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా విద్యాలయాలు, గురుకుల పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. స్వచ్ఛత పక్షోత్సవాలను అన్ని పాఠశాలల్లో నిర్వహించడం ద్వారా విద్యార్థులకు అవగాహన పెరిగి పరిసరాల పరిశుభ్రతపై వ్యక్తిగత శుభ్రతతోపాటు సమాజానికి మేలు జరిగే అవకాశం ఉంది. కార్యక్రమంపై ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రణాళికను రూపొందించారు. ఆసక్తి అభిరుచి పెంపొందించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకుని ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

కార్యక్రమాలు ఇలా..

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరిలోనూ అవగాహన పెంపొందించడం, సమాజ భాగస్వామ్యం కల్పించడం, మొక్కలు నాటి ప్రకృతి చైతన్యాన్ని కలగజేయడం, పర్యావరణంపై అవగాహన పెంపొందించడం అనే ప్రధాన లక్ష్యాలుగా ఈ స్వచ్ఛ పక్వాడ పక్షోత్సవాలను నిర్వహించనున్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో పాఠశాల స్థాయి పోటీలు కూడా నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తారు.

తేదీల వారీగా కార్యక్రమాలు

- 1వ తేదీన.. ఉపాధ్యాయులు విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తారు
- 2 ,3 తేదీల్లో.. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన, చైతన్యం కల్పిస్తారు.
- 4, 5 తేదీల్లో.. పాఠశాలను సమాజానికి చేరువ చేయడం, స్థానిక ప్రజలు, విద్యావేత్తలతో విద్యార్థులు మమేకం కావడం, వారికి కూడా స్వచ్ఛత గురించి తెలియజేయడం.
- 6వ తేదీన.. హరిత దినోత్సవంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులతో మొక్కలు నాటిస్తారు.
- 7, 8 తేదీల్లో.. స్వచ్ఛత భాగస్వామ్యంలో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస, క్విజ్ తదితర పోటీలు నిర్వహిస్తారు.
- 9, 10 తేదీల్లో.. చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, మధ్యాహ్న భోజన సమయంలో సరిగా కడుక్కోవడం, పరిశుభ్రత ప్రాధాన్యతను వివరిస్తారు. చేతులను శుభ్రం చేసే విధానాన్ని నేర్పిస్తారు.



స్వచ్ఛ పక్వాడ కరపత్రం

- 11వ తేదీన.. వ్యక్తిగత పరిశుభ్రత దినోత్సవం నిర్వహిస్తారు.
- 12న సమాజంలో విద్యార్థిని భాగస్వామ్యం చేయడం ద్వారా విద్యార్థి పాత్రను గుర్తింపజేస్తారు. స్వచ్ఛతపై పాఠశాల స్థాయిలో ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తారు.
- 13, 14 తేదీల్లో.. స్వచ్ఛతపై ప్రణాళిక, కార్యాచరణ విధానాన్ని విద్యార్థులతో సిద్ధం చేయిస్తారు. స్వచ్ఛత ప్రాముఖ్యతను నిర్దేశిస్తారు.
- 15వ తేదీన.. 15 రోజులపాటు నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తారు.

పటిష్టంగా అమలు..



రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో స్వచ్ఛ పక్వాడ కార్యక్రమాలు నిర్వహిస్తాం. 15 రోజులపాటు రోజుకో అంశాన్ని తీసుకుని విద్యార్థులలో చైతన్య కార్యక్రమాలు, అవగాహన చేపట్టాలి. ఈ మేరకు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలిచ్చాం. విద్యార్థులకు, సమాజానికి పరిశుభ్రతపై అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో పాఠశాల విద్యాశాఖ ఈ కార్యక్రమం అమలు చేస్తోంది.
– డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

'ఎస్టీపీపీ'కి డిప్యూటీ సీఎం



డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క



డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్, డీసీపీ భాస్కర్, సింగరేణి అధికారులు, తదితరులు

- నేడు మూడో ప్లాంటు, అభివృద్ధి పనుల పరిశీలన
- 11మెగావాట్ల సోలార్‌ప్లాంటు ప్రారంభించనున్న 'భట్టి'

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంటు(ఎస్టీపీపీ)కు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తొలిసారిగా శనివారం వస్తున్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పర్యటనలో భాగంగా విద్యుత్‌శాఖ మంత్రిగా ఉన్న ఆయన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించనున్నారు. ప్లాంటులో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలిస్తారు. జైపూర్‌లో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో 600 మెగావాట్లు చొప్పున రెండు ప్లాంట్లలో 1200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న విషయం తెలిసిందే. 2016లో ప్రారంభమైన ఈ కేంద్రంలో ప్రస్తుతం ఉన్న రెండింటికి అదనంగా మూడో ప్లాంటు ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. విద్యుత్ ఉత్పత్తి చేస్తూ రాష్ట్రానికి కొరత లేకుండా చూస్తోంది. ఈ క్రమంలో ఇక్కడే సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంటును రూ.6,800 కోట్లతో నిర్మాణం చేపట్టనుంది. ఈ యూనిట్ కోసం ఇప్పటికే కేంద్రంలో పర్యావరణ, కాలుష్య తదితర శాఖల నుంచి అనుమతులు పొందింది. గతంలో టెండర్లు పిలిచినా కొంత జాప్యం జరిగింది. స్థానికంగా బొగ్గు, నీరు, అవసరమైన భూమి ఉండడంతో ఇక్కడే మరో ప్లాంటు ఏర్పాటుకు గతంలో ప్రణాళిక వేసింది. ఈ మేరకు టెండర్లు ఆహ్వానించింది. గత మార్చిలో పనులు ప్రారంభం కావాల్సి ఉండగా జాప్యం జరిగింది. 15మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తిలో భాగంగా ప్లాంటు ఆవరణలోని రిజర్వాయర్ నీటిపై తేలియాడే సౌరఫలకాలు ఏర్పాటు చేసింది. ఇందులో తొలి విడత ఐదు మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. అలాగే ఫ్లూగ్యాస్ డీసల్ఫరైజేషన్(ఎఫ్‌జీడీ), కార్బన్ డై ఆక్సైడ్‌ను తగ్గించేందుకు ఏర్పాటు చేస్తున్న మిథనాల్ ప్లాంటు నిర్మాణ పనులు సాగుతున్నాయి. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తన పర్యటనలో ఈ పనులన్నీ పరిశీలిస్తారు. చెన్నూర్ మండలం శివలింగాపూర్ శివారులో ఏర్పాటు చేసిన 11మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభిస్తారు.

ఇదీ షెడ్యూల్..

డిప్యూటీ సీఎం విక్రమార్క శనివారం ఉదయం 9.30గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో రామగుండంకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2.30గంటల వరకు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం రోడ్డు మార్గంలో 3.15 గంటలకు చెన్నూర్ మండలం శివలింగాపూర్ శివారులో ఏర్పాటు చేసిన 11మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం 4.30గంటల నుంచి 5.30గంటల మధ్య జైపూర్ ఎస్టీపీపీని సందర్శిస్తారు. నీటిపై తేలియాడే సౌర విద్యుత్ ఉత్పత్తి చేసే రిజర్వాయర్‌ను పరిశీలిస్తారు. ప్లాంటు పరిపాలన భవనాన్ని ప్రారంభిస్తారు. కంట్రోల్ రూం, సీవో2 మిథనాల్ ప్లాంటు, 800 మెగావాట్ల విద్యుత్ కేంద్ర ఏర్పాటు స్థలాన్ని సందర్శిస్తారు.

క్లుప్తంగా

శ్రీరాంపూర్ నుంచి కార్గో సేవలు


ప్రారంభిస్తున్న లాజిస్టిక్ మేనేజర్ పాల్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ బస్టాండ్ నుంచి టీజీ ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభించింది. శుక్రవారం కార్గో పార్సిల్ కేంద్రాన్ని ఆర్టీసీ లాజిస్టిక్ మేనేజర్ బి.పాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంపూర్ పట్టణ, పరిసర ప్రాంతవాసుల సౌకర్యార్థం కార్గో పార్సిల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇతర వాటితో పోల్చితే కార్గోలో సరుకులు వేగంగా, భద్రంగా గమ్యస్థానాలకు చేరుకుంటాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్గో సేల్స్ టీం సభ్యులు కె.సాయన్న, మహేశ్వర్, బి.రమేశ్, ఏజెంట్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఒకరికి మూడేళ్ల జైలు

వేమనపల్లి: దొంగతనం కేసులో మండలంలోని కల్మలపేటకు చెందిన సల్పాల శ్రీనివాస్‌కు మూడేళ్ల సాధారణ జైలుశిక్షతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ శుక్రవారం బెల్లంపల్లి జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముఖేష్ తీర్పుచెప్పారు. నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ కథనం ప్రకారం..2024 మే 26న కల్మలపేటకు చెందిన నెండుగూరి రాజన్న ఇంటి ఆవరణలో నిద్రిస్తున్నాడు. రాత్రి సమయంలో శ్రీనివాస్ చొరబడి 14.75 తులాల బంగారం, ఆరు తులాల వెండి రూ.2.62 లక్షల నగదు ఎత్తుకెళ్లాడు. బాధితుడు ఫిర్యాదుతో ఎస్సై శ్యాంపటేల్ కేసు దర్యాప్తు చేపట్టారు. చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి నిందితుడిని హాజరపర్చారు. కోర్టు కానిస్టేబుల్ సంపత్, ఏపీపీ అజయ్‌కుమార్ ఆరుగురు సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో ఈ మేరకు మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.

జేసీబీ ఆపరేటర్‌కు 11 రోజుల రిమాండ్

భీమారం: మండలంలోని అంకూసాపూర్‌కు చెంది న జేసీబీ ఆపరేటర్ పల్ల మురళీకి 11 రోజులు రి మాండ్ విధిస్తూ చెన్నూరు మున్సిఫ్ కోర్టు జడ్జి రవి కుమార్ శుక్రవారం తీర్పుచెప్పారు. అటవీశాఖ మంచిర్యాల రేంజ్ ఆఫీసర్ రత్నాకర్‌రావు కథనం ప్రకారం.. 2021, అక్టోబర్ 29న మంచిర్యాల అట వీ డివిజన్ పరిధి పోలంపల్లి రిజర్వు ఫారెస్ట్‌లో ము రళీ జేసీబీతో తవ్వకాలు చేపట్టాడు. ఈమేరకు అతనిపై కేసు నమోదైంది. అటవీశాఖ కోర్టులో చార్జిషీ టు దాఖలు చేయగా ఏ2 నిందితుడిగా ఉన్న మురళీ గైర్హాజరయ్యాడు. జడ్జి నాన్‌బెయిల్ వారెంట్ జారీ చేయగా మురళీని కోర్టులో హాజరుపర్చగా ఆదిలాబాద్ జిల్లా జైలుకు రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చారు.

కల్వర్టు ఢీకొన్న కారు

- మంటల్లో దగ్ధం


దగ్ధమైన కారు

సిర్పూర్(టి): మండలంలోని వేంపల్లి సమీపంలో శుక్రవారం వేకువజాము కల్వర్టును ఢీకొన్న కారు మంటల్లో దగ్ధమైంది. ఎస్సై కమలాకర్ కథనం ప్రకారం.. చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్‌కు చెందిన వాసుదేవ్ చక్రవర్తి తన సాంట్రో కారులో అత్తమ్మను కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో దింపి తిరి గివస్తున్నాడు. ఈ క్రమంలో శ్మశానవాటిక వద్ద అ దుపుతప్పి కల్వర్టును ఢీకొంది. కారులో ఒక్కసారి గా మంటలు చెలరేగడంతో డ్రైవరు సంజుతో పా టు వాసుదేవ్ చక్రవర్తి స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు ఫైర్ స్టేషన్‌కి సమాచారం అందించి మంటలార్పివేశారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఆర్టీసీలో సెమీ డీలక్స్


సెమీ డీలక్స్ బస్సు

- అందుబాటులోకి కొత్త సర్వీస్‌లు
- ప్రయోగాత్మకంగా పలు రూట్లలో సేవలు
- ఆదిలాబాద్ రీజియన్‌లో స్పందన
- ప్రయాణికులకు సౌకర్యం.. సంస్థకు ఆదాయం

ఆదిలాబాద్: ఆదాయ వనరులు పెంచుకునే దిశగా ఆర్టీసీ కసరత్తు చేస్తోంది. కొత్తగా సెమీ డీలక్స్ సర్వీసును అందుబాటులోకి తెచ్చింది. ఆదిలాబాద్ రీజియన్ డిపోల్లో పలు రూట్లలో ప్రయోగాత్మకంగా సేవలందిస్తుండడంతో స్పందన లభిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తోంది. దీంతో బస్సుల్లో రద్దీ పెరిగింది. 'మహాలక్ష్మి'పథకం నిధులను ఆర్టీసీకి రీయింబర్స్‌మెంట్ ప్రక్రియ ఆలస్యమవుతోంది. దీంతో సంస్థకు ఆదాయం తగ్గడంతో టికెట్ ఆదాయం పెంపుపై దృష్టిపెట్టి సెమీడీలక్స్ బస్సు సర్వీసులను ప్రవేశపెట్టింది.

పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో

మహాలక్ష్మి పథకం అమలు ముందు బస్సుల్లో ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో మోస్తరుగా ఉండేది. పండుగలు, పెళ్లిళ్ల సీజన్‌లో తప్పితే మిగతా సమయాల్లో ఓఆర్ 65 శాతం నమోదయ్యేది. ప్రస్తుతం 80 నుంచి 100 శాతం వరకు నమోదవుతుంది. ముఖ్యంగా పండుగ సమయాల్లో సెంచరీ దాటుతోంది. పలు సందర్భాల్లో పరిమితికి మించి ప్రయాణికులు వెళ్తున్న సమయాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఓఆర్ శాతం పెరగడం, 'మహాలక్ష్మి'ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కారణంగా సంస్థకు వచ్చే ఆదాయంపై ప్రభావం పడుతుంది. రోజువారీ ఖర్చులు, నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు తదితర వాటికి ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని సెమీ డీలక్స్ బస్సులను తీసుకువచ్చింది.

ఎక్స్‌ప్రెస్‌కు ఎక్కువ..డీలక్స్‌కు తక్కువ

ఎక్స్‌ప్రెస్‌తో పోల్చితే సెమీ డీలక్స్ బస్సు చార్జీ ఎక్కువ. డీలక్స్ కంటే తక్కువగా వసూలు చేస్తున్నారు. సెమీడీలక్స్ బస్సు కి.మీ 137 పైసలుగా చార్జీని నిర్ణయించారు. ఎక్స్‌ప్రెస్ బస్సు కి.మీ 126 పైసలు ఉండగా డీలక్స్‌కు కి.మీ 144 పైసలు తీసుకుంటున్నారు. మినిమం టికెట్ చార్జీ మాత్రం ఎక్స్‌ప్రెస్, సెమీ డీలక్స్ బస్సుల్లో సమానంగా తీసుకుంటున్నారు. దీంతో పలువురు ప్రయాణికులు సెమీ డీలక్స్ బస్సుల వైపు మొగ్గు చూపుతున్నారు.

బస్సు స్వరూపం ఇదీ..

ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులు 10 మీటర్ల పొడవు, 51 సీట్లను కలిగి ఉంటాయి. అయితే సెమీడీలక్స్ బస్సు 12 మీటర్ల పొడవు ఉంది. 60 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఒక వైపు 3, మరో వైపు 2 సీట్లు ఉండడం, ఆకర్షణీయమైన సీట్ కవర్లతో ఆకట్టుకునేలా తయారు చేశారు. ప్రయాణికులు వీటికి మొగ్గుచూపుతారని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు.

ఆదిలాబాద్ రీజియన్‌కు 4 బస్సులు

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో నాలుగు సెమీ డీలక్స్ బస్సులను కేటాయించారు. నిర్మల్ డిపోకు రెండు బస్సులను కేటాయించగా, ఆదిలాబాద్ డిపోకు ఒకటి, మంచిర్యాల డిపోకు ఒక సర్వీస్ కేటాయించారు. ఈ సర్వీస్ లను రద్దీని బట్టి వివిధ రూట్లలో నడుపుతున్నారు. ముఖ్యంగా పండుగల సమయాల్లో ఈ సర్వీసులు ఎంతగానో ప్రయాణికులకు ఉపయోగపడుతున్నాయి.

ప్రయాణికుల స్పందనతో ముందుకు..



ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 4 సెమీడీలక్స్ బస్సులు నడుపుతున్నాం. బిజీ రూట్లలో కేటాయిస్తున్నాం. సందర్భాన్ని బట్టి ఏ ఏయే రూట్లలో అవసరమో నిర్ణయించి సర్వీసును నడుపుతున్నాం. ప్రయాణికుల స్పందన చూసి ముందుకెళ్తాం.

– సోలోమన్, ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్

ఆదిలాబాద్ రీజియన్‌లో బస్సుల వివరాలు..

డిపో	ఎక్స్‌ప్రెస్	పల్లెవెలుగు	సెమీ డీలక్స్	మొత్తం
ఆదిలాబాద్	34	67	01	102
భైంసా	09	65	00	74
నిర్మల్	37	65	02	104
ఉట్నూర్	00	25	00	25
ఆసిఫాబాద్	07	56	00	63
మంచిర్యాల	21	84	01	106

ఎస్టీపీపీ నిర్వాసితుల గోడు వినండి

- పర్మినెంట్ ఉద్యోగాలు కల్పించాలి
- పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో 'భట్టి' అనేక హామీలు
- నేడు డిప్యూటీ సీఎం రాకపై కార్మికుల్లో ఆశ


జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు

జైపూర్: జైపూర్ ఎస్టీపీపీ విస్తరిస్తూ.. మరోపక్కన ఫ్లోటింగ్, భూమిపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తూ సంస్థ దినదినాభివృద్ధి చెందుతోంది. ప్లాంటు నిర్మాణ కోసం భూములు ఇచ్చిన తమకు తగిన న్యాయం జరగడం లేదని నిర్వాసితులు వాపోతున్నారు. ఇతర పవర్‌ప్లాంటులో కార్మికులకు చెల్లిస్తున్న విధంగా వేతనాలు, అలవెన్సులు, సౌకర్యాలు కల్పించాలని, శాశ్వత పద్ధతుల్లో ఉద్యోగాలు కల్పించాలని కార్మికసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో పీపుల్స్‌మార్చ్ సందర్భంగా జిల్లాలో నేటి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాదయాత్ర చేపట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సింగరేణిని, కాంట్రాక్టు కార్మికులు, భూనిర్వాసితులపై చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక శాశ్వత ఉద్యోగాలు, వేతనాల పెంపు, అలవెన్సు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో శనివారం పవర్ ప్లాంటు పర్యటనకు వస్తున్న డిప్యూటీ సీఎం.. ఆ హామీలు అమలు చేయాలని కోరుతున్నారు. కార్మికులకు ఆయన ఇచ్చే వరాలపై పలువురు ఆశ పెట్టుకున్నారు.

ఈపీఆర్‌లో తప్పులు సరిచేయాలి


వర్క్‌షాప్ డీజీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: కార్మికుల ఈపీఆర్ రికార్డులో నమోదు చేస్తున్న వ్యక్తిగత సమాచారం కొందరివి తప్పుగా నమోదవుతున్నాయని, వీటిని సరిచేయాలని హెచ్ఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య ఆధ్వర్యంలో శుక్రవారం వర్క్‌షాప్ డీజీఎం రవీందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు కార్మికుల వ్యక్తిగత వివరాలు కంప్యూటర్‌లో తప్పుగా నమోదైనట్లు తెలిపారు. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి వాటిని సరిచేయాలని కోరారు. ఎక్కడా లేని విధంగా ఔట్ మస్టర్ 3:20 గంటలకు నమోదు చేయడం సరికాదన్నారు. మహిళా కార్మికులు వాష్‌రూమ్స్ లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే వాష్ రూమ్స్‌ను, రెస్ట్‌హాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి అనిల్‌రెడ్డి, వర్క్‌షాప్ పిట్ సెక్రటరీ పి.అశోక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దుర్గం లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

2,364 మందికి జనరల్ మజ్దూర్‌గా క్రమబద్ధీకరణ

శ్రీరాంపూర్: సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో 2,364 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబదీకరిస్తూ సంస్థ సీఎండీ ఎన్.బలరాం నాయక్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు వారికి సెప్టెంబర్ 1 నుంచి అమలయ్యేలా ఉత్తర్వులు ఇ వ్వాలని డైరెక్టర్(పా)ని ఆదేశించారు. క్యాలెండర్ సంవత్సరంలో సర్ఫేస్‌లో 240 మస్టర్లు, భూగర్భంలో 190 మస్టర్లు పూర్తి చేసిన బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్‌గా క్రమబద్ధీకరిస్తున్నారు. ఏరియాల వారీగా పరిశీలిస్తే కార్పొరేట్‌లో 25, ఇల్లందు 9, కొత్తగూడెం 17, మణుగూరు 21, భూపాలపల్లిలో 476, ఆర్జీ–1లో 563, ఆర్జీ–2లో 50, ఆర్జీ–3లో 240, శ్రీరాంపూర్‌లో 655, మందమర్రిలో 299, బెల్లంపల్లిలో 9 మందిని జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరించారు.

జిల్లా అధ్యక్షుడిగా శంకర్



మందమర్రిరూరల్: పట్టణానికి చెందిన బండి శంకర్‌ను జాతీయ మానవ హక్కుల రక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు సైరాబాను శుక్రవారం నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియమించినందుకు న్యాయం చేస్తానని తెలిపారు.

నియామక పత్రం అందిస్తున్న సైరాబాను

గంజాయి విక్రేతల అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు


స్వాధీనం చేసుకుంటున్న ఎస్సై సాగర్

కాగజ్‌నగర్‌రూరల్: గంజాయి విక్రేతలను శుక్రవారం అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. మండలంలోని ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలో నజ్రూల్‌నగర్ విలేజ్‌నెం.1 గ్రామంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. రాజ్‌కుమార్ సర్కార్ ఇంటిని తనిఖీ చేయగా 55 గ్రాముల గంజాయి లభ్యమైందని పేర్కొన్నారు. మహారాష్ట్ర నుంచి గంజాయిని తీసుకువచ్చి చిన్న, చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి కాగజ్‌నగర్, చింతగూడ, బురదగూడ గ్రామాలకు చెందిన యువకులకు విక్రయించేవాడు. ఈజ్‌గాంలోని నిర్మానుష్య ప్రాంతానికి వారందరిని పిలిచి ఒక ప్యాకెట్ రూ.500కు విక్రయించి సొమ్ముచేసుకునేవాడు. పక్కా సమాచారంతో దాడి చేసి పట్టుకుని ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.1 గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ సర్కార్, మారుతినగర్‌కు చెందిన బోషంలా భీమేశ్, బోరిగాం గ్రామానికి చెందిన ఎండీ అతీక్, కామ్రె కార్తీక్, పకీజానగర్‌కు చెందిన ఎండీ ఆరీఫ్ హుస్సేన్, నౌగాంబస్తీకి చెందిన ఎస్‌కె తన్వీర్ అరెస్టు అయినవారిలో ఉన్నారు. ఎస్సై వెంకటేశ్, సిబ్బంది మధు, రమేశ్ పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

జైనూర్: మండలంలోని గౌరీకొలంగూడా గ్రామానికి చెందిన సిడాం రాము తన చేనులో పత్తితో పాటు సాగు చేస్తున్న గంజాయి మొక్కలను శుక్రవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు జైనూర్ ఎస్సై సాగర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. పక్కా సమాచారంతో పోలీసులు చేను వద్దకు వెళ్లి 30 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. సిడాం రాముపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు జూనియర్ సివిల్ జడ్జిలకు పదోన్నతి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో జూనియర్ సివిల్ జడ్జిలుగా పనిచేస్తున్న ఇద్దరికి పదోన్నతి లభించింది. ఈమేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఆదిలాబాద్ జూనియర్ సివిల్ జడ్జి, జుడీషియల్ మెజిస్ట్రేట్ మంజూల సూర్యవార్, మంచిర్యాల జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సి.సంపత్‌లకు పదోన్నతి కల్పించారు.

నలుగురు బైండోవర్

మందమర్రిరూరల్: పులిమడుగుకు చెందిన భుక్య శ్రీలత, బోనోత్ ఉమ, రామకృష్ణాపూర్‌కు చెందిన యశోద, శంకరమ్మను తహసీల్దార్ సతీశ్‌కుమార్ ఎదుట శుక్రవారం బైండోవర్ చేశారు. గుడుంబా తయారీ చేసినా, విక్రయించినా నేరమేనని ఎక్సైజ్ ఎస్సై శారద హెచ్చరించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా సమీపంలో అక్రమంగా తరలిస్తున్న పశువులను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..డబ్బా సమీపంలో తనిఖీ చేస్తుండగా ఖర్జవెల్లి నుంచి మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు బొలెరో వాహనంలో తరలిస్తున్న నాలుగు ఎద్దులు పట్టుబడ్డాయని తెలిపారు. ఎలాంటి రసీదు లేకపోవడంతో వాహనం సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. లక్సెట్టిపేటకు చెందిన డ్రైవర్ సయ్యద్ అజీముద్దీన్, దండేపల్లికి చెందిన అక్కల తిరుపతిపై కేసు నమోదు చేశామన్నారు.

వైన్స్‌షాపు చోరీ దొంగల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ భీమేశ్

నేరడిగొండ: వైన్స్ షాపులో చోరీకి పాల్పడిన దొంగలను అరెస్టు చేసినట్లు ఇచ్చోడ సీఐ భీమేశ్ తెలిపారు. నేరడిగొండ పోలీసుస్టేషన్‌లో సీఐ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాతోపాటు మహారాష్ట్రకు చెందిన చౌహాన్ రవి, స్నేహితులు 11 మంది సభ్యులు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. ఈనెల 24న నేరడిగొండలో తరుణ్ వైన్స్ షాపులో చోరీ చేశారు. వైన్స్ యజమాని ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం 10 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.20వేల నగదుతోపాటు రూ.50వేల విలువ గల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఏ1 నిందితుడు చౌహాన్ రవి పరారీలో ఉన్నాడు. సమావేశంలో ఎస్సై శ్రీకాంత్, పోలీసులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

ఇచ్చోడ: పురుగుల మందు తాగిన యువతి రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. మండలంలోని ముఖరా(కే) గ్రామానికి చెందిన తల్వారే శ్రీదేవి (18) గత కొన్నిరోజులుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. నొప్పి భరించలేక ఈనెల 27న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందింది. తండ్రి వెంకటి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఏటీఎం చోరీకి విఫలయత్నం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వినాయక్‌చౌక్ ప్రాంతంలో గల ప్రైవేట్ పాఠశాల ఎదురుగా ఉన్న ఎస్బీఐ ఏటీఎంలో దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. గురువారం రాత్రి ఏటీఎంలోకి చొరబడి మిషన్‌ను పగలగొట్టేందుకు యత్నించారు. యంత్రం నుంచి శబ్దం రావడంతో అక్కడి నుంచి పరారైనట్లు వన్‌టౌన్ ఎస్సై సయ్యద్ ఇసాఖ్ అలీ తెలిపారు. ఎస్బీఐ చీఫ్ మేనేజర్ పెనమూర్తి సత్యనారాయణ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సీసీ పుటేజీలు పరిశీలిస్తున్నట్లు వివరించారు.

వృద్ధురాలి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తాటిగూడకు చెందిన వృద్ధురాలు గుమ్ముల గంగమ్మ అదృశ్యమైంది. ఈనెల 28న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు చుట్టుపక్కలా వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో శుక్రవారం ఆమె కుమారుడు అశోక్ టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.

స్క్రాప్ దొంగ అరెస్టు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఎంసీసీ సిమెంట్ ఫ్యాక్టరి నుంచి స్క్రాప్ ఇనుప సామగ్రి దొంగిలించిన రాజీవ్‌నగర్‌కు చెందిన గుమ్మడి సారయ్యను అరెస్ట్ చేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం చోరీ జరిగిందని సెక్యూరిటీ ఇన్‌చార్జి కే.దాస్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బెల్లంపెల్లి చౌరస్తాలో సారయ్యను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. స్క్రాప్ విలువ రూ.5వేల వరకు ఉంటుందని తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మద్యం మత్తులో వీరంగం

మంచిర్యాలకు చెందిన వసాక పున్నం మద్యంమత్తులో స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తూ వీరంగం సృష్టించగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఆర్టీసీ కంట్రోలర్ సమాచారం మేరకు న్యూసెన్స్ కేసు న మోదు చేసినట్లు తెలిపారు.

లెక్క తప్పుతోంది..!

- హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్యపై తికమక
- మ్యానువల్ రిజిస్టర్లతో సరి
- ఆన్‌లైన్ కాలేదని ఇష్టారాజ్యం



బీసీ సమీకృత వసతిగృహం

మంచిర్యాలఅర్బన్: వసతిగృహాల్లో పర్యవేక్షణ కొరవడి నిర్వహణ ఇష్టారాజ్యంగా సాగుతోంది. విద్యాసంస్థలు పునః ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా వసతిగృహాల్లోని విద్యార్థుల సంఖ్యపై గందరగోళం నెలకొంది. ఓ వైపు సాంకేతికతో ముందుకు వెళ్తున్న తరుణంలోనూ పాత పద్ధతి(మ్యానువల్)లో రిజిస్టర్లతో సరిపెడుతున్నారు. విద్యార్థుల లెక్క పక్కాగా తేల్చే బయోమెట్రిక్‌లు మూలనపడడం.. అడిగేవారు లేరనో..! ఏమో గానీ వసతిగృహాల నిర్వాహకులు రిజిస్టర్లపై ఆధారపడుతూ వచ్చినా.. రాకపోయినా విద్యార్థుల సంఖ్య నమోదు చేస్తూ 'మామూలు'గా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులు తక్కువగా వచ్చినా ఎక్కువ సంఖ్యలో హాజరైనట్లు లెక్కలు వేసి కొంతమేర నిధులు మిగుల్చుకుంటున్నారని తెలుస్తోంది.

ఒక్కో హాస్టల్ ఒక్కోలా..

ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పేర్లు నేరుగా నమోదు చేసుకుంటారు. అదే పేరు వసతిగృహాల్లో నమోదవుతుంది. పోస్టుమెట్రిక్ వసతిగృహాల్లో ఉంటూ కళాశాలల్లో చదివే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌తో ముడిపడి ఉంటుంది. కాలేజీ ప్రవేశం పొందిన తర్వాత విద్యార్థుల వివరాలు ఆన్‌లైన చేయాలి. ఆ తర్వాత స్కాలర్‌షిప్‌కు చేసిన దరఖాస్తును వసతిగృహాల్లో ఇవ్వాల్సి ఉంటుంది. స్కాలర్‌షిప్ ప్రక్రియ ఆలస్యమవుతుందని మ్యానువల్ ఫారమ్ తీసుకుని వసతిగృహాల్లో ప్రవేశం కల్పిస్తూ భోజనం పెడుతున్నారు. ఆన్‌లైన్‌లో పేరొచ్చిన తర్వాత అటెండెన్స్‌కు అవకాశం ఉంది. ఇదే అదనుగా భావించిన వసతిగృహాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బీసీ వసతిగృహాల్లో ప్రవేశం పొందిన వెంటనే ఆన్‌లైన్‌లో పేరు కనిపిస్తుండడంతో విద్యార్థుల లెక్క తెలిసిపోతుంది. మూడు నెలలైనా బయోమెట్రిక్ లేక హాజరు ప్రక్రియ రిజిష్టర్‌లో సాగుతోంది. ఎస్టీ హాస్టల్‌లో ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్ సిస్టం(ఎఫ్ఆర్ఏఎస్) ఇప్పుడిప్పుడే ప్రారంభం కాగా అంతా చేతిరాతతోనే అటెండెన్స్ సాగుతుండడంతో విద్యార్థుల లెక్క గందరగోళంగా మారింది.

ఎవరి ఇష్టం వారిదే..

రిజిష్టర్(మ్యానువల్)లో విద్యార్థుల హాజరుతో అవకతవకలకు ఆస్కారం లేకపోలేదు. ఒక్కో వసతిగృహంలో 100 నుంచి ఆపైన విద్యార్థులు ప్రవేశం పొందినా కచ్చితమైన హాజరు నమోదు అనుమానమే. ప్రతీరోజు తనిఖీలకు అవకాశం తక్కువ కావడంతో వార్డెన్లదే పెత్తనం. ఎవరైనా తనిఖీకి వచ్చినా రిజిష్టరే కావడంతో ఎలాగైనా రాసుకునే వీలుంది. హాజరు వేసినా పది పదిహేను మంది అయితే హాస్పిటల్, ఇతర అత్యవసర పని అంటూ సర్దిచెబుతున్నారే అపవాదు లేకపోలేదు. కళాశాల విద్యార్థులకు టిఫిన్‌తోపాటు మధ్యాహ్న భోజనం కూడా ఉదయాన్నే అందిస్తున్నారు. వేడి భోజనం అందించాల్సి ఉన్నా వార్డెన్లు సద్దిభోజనంతో చేతులు దులిపేసుకుంటున్నారు. ప్రీమెట్రిక్ విద్యార్థులకు రూ.950 నుంచి రూ.1150 వరకు, పోస్టుమెట్రిక్ విద్యార్థులకు రూ.1500వరకు ప్రభుత్వం చెల్లిస్తోంది. దీని ప్రకారం రోజుకు రూ.50 చొప్పున లెక్కేసుకున్నా పది విద్యార్థుల ఎక్కువ నమోదుతో రూ.500 వరకు వార్డెన్ ఖాతాల్లోకి వెళ్లినట్లే. ఇలా లెక్కల్లో తేడాతో అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఎస్టీ వసతిగృహాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

పాఠశాలల్లో పక్కాగా..

ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్ఆర్‌సీపీ విధానం అమలవుతోంది. విద్యార్థుల హాజరు తేల్చేందుకు డీఎస్‌సీఎఫ్ఆర్‌సీపీ పేరిట యాప్ రూపొందించారు. హెచ్ఎం, ఉపాధ్యాయుడు తమ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ ఓపెన్ చేసి విద్యార్థుల ముఖం వైపు చూపితే హాజరు నమోదవుతుంది. దీంతో విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజన సమయంలో హాజరు, లెర్నింగ్ యాక్టివిస్ తెలిసిపోతాయి. ఎస్టీ వసతిగృహాల్లో ఎఫ్ఆర్‌సీపీ అమలుకు ప్రక్రియ చేపట్టగా 70శాతం మేర పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. బీసీ, ఎస్సీ వసతిగృహాల్లో ఈ విధానం అమల్లోకి వస్తే విద్యార్థుల లెక్కతోపాటు నిత్యావసర సరుకులు, ఇతర వివరాలు ఇట్టే తెలిసిపోతాయి. అప్పటి వరకు ఆయా వసతిగృహాల అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడితే అక్రమాలకు చెక్‌పడే వీలుంది.

జిల్లాలో..

జిల్లాలో బీసీ ప్రీమెట్రిక్ వసతిగృహాలు ఎనిమిది ఉండగా 985మంది విద్యార్థులకు గాను 748 మంది ప్రవేశం పొందారు. పోస్టుమెట్రిక్ వసతిగృహాలు ఎనిమిదింటిలో 700మందికి గాను 897మందికి అవకాశం కల్పించారు. మంచిర్యాలలోని అద్దె భవనాల్లో కొనసాగుతున్న బీసీ బాలుర వసతిగృహం గదులు అంతంతే. వంద మందికి గాను 156మందికి ప్రవేశం కల్పించారు. ఇరుకుగా ఉండే గదుల్లో అంతమంది ఎలా ఉంటారనేది అధికారులకే తెలియాలి.

- బీసీ హాస్టళ్ల వార్డెన్లకు రెండు నుంచి మూడేసి వసతిగృహాల(20కిలోమీటర్లకు పైగా దూరం)కు ఇన్‌చార్జిలుగా నియమించడంతో పర్యవేక్షణ కొరవడుతోంది.
- ఎస్సీ ప్రీమెట్రిక్ వసతిగృహాలు 17 ఉండగా.. విద్యార్థులు లేక మూడు మూతపడ్డాయి. 1,207మంది హాస్టళ్లలో ఉంటూ పాఠశాలలో చదువుకుంటున్నారు. పోస్టుమెట్రిక్ 8 వసతిగృహాల్లో 819 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. ఇక్కడ కూడా వంద మంది ఉండాల్సిన చోట 120 నుంచి 180మంది వరకు వసతి పొందుతున్నారు. 15మంది వార్డెన్లకు గాను పది మంది విధులు నిర్వర్తిస్తుండగా..పక్కపక్కనే ఉండే వారికి వసతిగృహాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.
- రెండు ఎస్టీ పోస్టుమెట్రిక్ వసతిగృహాల్లో 442మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇందులో బాలుర వసతిగృహంలో 265మంది ప్రవేశం పొందడం గమనార్హం. వసతిగృహ పర్యవేక్షణ బాధ్యతలు సీనియర్ విద్యార్థులకు అప్పగించి వార్డెన్ ఎక్కువగా ఇతరత్రా పనుల్లో నిమగ్నం అవుతున్నట్లు తెలుస్తోంది. ప్రవేశం పొందిన విద్యార్థులు, హాజరైన వారికి సంఖ్యకు వ్యత్యాసం ఉండడంపై భిన్నాభిప్రాయాలు లేకపోలేదు.